

- రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఆఫర్ల పేరిట మాయ మాటలు
- ఖాతాల్లోంచి నగదు మాయం చేస్తున్న కేటుగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన
- జాగ్రత్తలు పాటిస్తేనే సేఫ్ : పోలీసులు

డబ్బులు ఎవరికీ ఊరికే రావు

7



కనువిందు చేస్తున్న నిజాంసాగర్

- కొనసాగుతున్న ప్రాజెక్టు నీటి విడుదల
- జిల్లా నలుమూలల నుంచి ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న పర్యాటకులు
- ప్రాజెక్టు పరిసరాల్లో వనభోజనాలతో సందర్శకుల సందడి
- ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు 210 టీఎంసీల ఇన్‌ఫ్లో

8

జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై అధికార యంత్రాంగం పకడ్బందీ నిఘా పెట్టింది. పొరుగు రాష్ట్రాల నుంచి గతంలో ధాన్యం తెలంగాణలో విక్రయించారని నిఘావర్గాలు తెలుపడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొరుగు రాష్ట్రాల ధాన్యం తెలంగాణలో విక్రయించకుండా చూడాలని ఆయా జిల్లాల యంత్రాంగానికి గట్టి ఆదేశాలను జారీ చేసింది. జిల్లా యంత్రాంగం సైతం ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగకుండా ఇతర రాష్ట్రాల నుంచి దళారులు ధాన్యాన్ని జిల్లాలో విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై నిఘా



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

- పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా చర్యలు
- అంతరాష్ట్ర సరిహద్దులపై నిఘా పెట్టిన పోలీసు,రెవెన్యూ శాఖలు
- సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు
- జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు 22 వేల282 మెట్రిక్‌టన్నులకు పైగా కొనుగోళ్లు
- ప్రారంభమైన 427 కొనుగోలు కేంద్రాలు



మద్నూర్‌లోని చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంతరాష్ట్ర సరిహద్దులపై పోలీసు, రెవెన్యూశాఖలు నిఘా పెట్టాయి. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటుచేసి పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. అదే విధంగా రైస్‌మిల్లులోను ధాన్యం నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా పెట్టింది. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు

కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులుగా ఉంది. ఈ రాష్ట్రాల నుంచి దళారులు, కొంతమంది వ్యాపారులు అక్రమంగా ధాన్యాన్ని జిల్లాకు తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తున్నారని నిఘావర్గాలు అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చాయి. దీంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణకు ధాన్యం రాకుండా చూడాలని సరిహద్దు జిల్లాల యంత్రాంగానికి రాష్ట్రప్రభుత్వం అప్రమత్తం చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం పొరుగురాష్ట్రాల సరిహద్దులపై నిఘా పెట్టిచెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. మద్నూర్ మండలం సబలత్‌పూర్, జుక్కల్, పిట్లం మండలాల్లోని కర్ణాటక బార్డర్‌లలో చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి రెవెన్యూపోలీసులు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భారీ లోడ్లు గల వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులోనూ..

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఇప్పటికే సిద్ధమైంది. జిల్లాయంత్రాంగం సైతం కొనుగోళ్ల (మిగతా 8వ పేజీలో..)



పెద్దకొడప్‌గల్ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం తడిసిన దృశ్యం

మొంథా ధాటికి
రైతులు విలవిల

- మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల వర్షాలు
- ఒక్కసారిగా వాతావరణంలో మార్పు
- ధాన్యం కుప్పలపై కవర్లు కప్పేందుకు పరుగులు పెట్టిన రైతులు
- వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

పెద్దకొడప్‌గల్/కామారెడ్డి రూరల్/లింగంపేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. పెద్దకొడప్‌గల్‌లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మార్పుచెంది వర్షం కురిసింది. దీంతో జాతీయ రహదారిపై వరి ధాన్యం కుప్పలు తడిసిముద్దయ్యాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు వరి కోతలు పూర్తిచేసి వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు జాతీయ రహదారిపైకి తీసుకొచ్చారు. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యం నీటిపాలైంది. రహదారిపై ఆరబెట్టిన ధాన్యం ఎండిందనుకున్న సమయంలో తడిసిపోవడంతో రైతులు విలపిస్తున్నారు. పంట సాగు ప్రారంభంలో సరైన వర్షాల్లేక ఇబ్బందుల పాలయ్యామని, ప్రస్తుతం వరుణుడు తమ పాలిట శత్రువుగా మారాడని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తడిసిన ధాన్యం

కామారెడ్డి మండలంలో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దీంతో ఇల్చిపూర్, గర్గుల్ ఇస్రోజివాడి పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసిపోయాయి. ఒక్కసారిగా నల్లమబ్బులు కమ్ముకొని అకాల వర్షం కురవడంతో ఆరబోసిన కుప్పలు చేయడానికి సమయం లేక పోవడంతో ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి ధాన్యాన్ని రైస్‌మిల్‌కు తరలిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు వాపోతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కూడా వర్షపు నీరు రోడ్ల పై నిల్వడంతో రోడ్లన్ని చిత్తడిగా మారాయి. గత కొంతకాలంగా అశోక్‌నగర్ రోడ్డు వెంబడి వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ కార్యాలయానికి, రైల్వేగేటుకు వెళ్లే రోడ్డు గుంతలతో పూర్తిగా అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షానికి మురికినీరు రోడ్డుపైకి వచ్చి చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

అవస్థలు పడుతున్న రైతులు

లింగంపేట్‌లోనూ వర్షం కురిసినంది. ఈ ఏడాది వరుణుడు తమపై పగబట్టినట్టు ఆరంభం నుంచి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సివస్తోందని, ఈసారి పెట్టుబడి కూడా వస్తుందో లేదో అని రైతులు కన్నీరు పెడుతున్నారు.



ధాన్యం తడవకుండా కుప్పలపై కవర్లు



మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

రైతులను మోసం చేస్తున్న రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌గౌడ్

బాన్సువాడటౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు కొనుగోలు కేంద్రాల్లోని కొందరు వ్యక్తులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని, అలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌గౌడ్ డిమాండ్‌చేశారు. మంగళవారం బాన్సువాడ మార్కెట్ కమిటీలో తడిచిన ధాన్యాన్ని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే రైస్‌మిల్లర్లు, కొందరు కొనుగోలు కేంద్రాల్లోని వ్యక్తులు కలిసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రైతులకు వెంటనే టార్పాలిన్‌లను అందజేయాలని, తడిసిన ధాన్యాన్ని ఆంక్షల్లేకుండా కొనుగోలు చేయాలని, తుఫాన్ కారణంగా పంట నష్టపోతే ఆ రైతులకు ఎకరాకు రూ.40వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్,ఖలీల్, యాదగిరిగౌడ్, రాజు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం..
ఇద్దరు పోలీసుల సస్పెన్షన్: ఎస్పీ

కామారెడ్డిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీ (స్పెషల్‌బ్రాంచ్)లో పనిచేసి పాస్‌పోర్టు విచారణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పోలీసు సిబ్బందిని ఇన్‌చార్జ్ డీఐజీ సన్‌ప్రీత్‌సింగ్ సస్పెండ్ చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ ఎల్.నర్సయ్య, రామారెడ్డి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి ఎస్‌బీలో పనిచేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తుల పాస్‌పోర్టు దరఖాస్తుల విచారణ చేపట్టాల్సి ఉండగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. క్రిమినల్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూఎస్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ పాస్‌పోర్టు జారీకి క్లియరెన్స్ ఇచ్చారని తెలిపారు. పూర్తివిచారణ జరిపి డీఐజీకి నివేదిక అందించడంతో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

రెవెన్యూ అధికారులు
సమయాన్ని పాటించాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి

నసురుల్లాబాద్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. సమయపాలన పాటించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ సువర్ణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అంతర్‌రాష్ట్ర సరిహద్దులోని
చెక్‌పోస్టు తనిఖీ

- ఇతర రాష్ట్రాల సన్నధాన్యం రాష్ట్రంలోకి రాకుండా చూడాలి: అదనపు కలెక్టర్ విక్టర్



పత్తి మిల్లును పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

మద్నూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి సరిహద్దుల్లో ఉన్న పత్తి మిల్లులను, సరిహద్దులోని చెక్ పోస్టులను అదనపు కలెక్టర్ వి.విక్టర్ పరిశీలించారు. మద్నూర్ మండలంలోని మంగళవారం అంతరాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును తనిఖీచేశారు. చెక్ పోస్టు సిబ్బందికి పోలీసులకు సలహాలు,సూచనలు అందజేశారు. రాష్ట్రంలో వరి కోనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని. సన్నవడ్లకు 500 బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి సన్న వడ్లు రాకుండా సరిహద్దు వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి వరిధాన్యం రాష్ట్రంలోకి రాకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే మద్నూర్ మార్కెట్‌లో జిన్నింగ్ మిల్లులను పరిశీలించి సంబంధిత జిన్నింగ్ మిల్లు యజమానులతో మాట్లాడారు. మిల్లులో తీసుకుంటున్న జాగ్రత్తలు ఏర్పాట్లను పరిశీలించి రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ కార్యదర్శిని ఆదేశించారు. అదనపుకలెక్టర్ వెంట తహసీల్దార్ ఎం.డి ముజీబ్, సివిల్ సప్లై నాయబ్‌తహసీల్దార్ ఖలీద్, రెవెన్యూ, పోలీస్, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

బిచ్కుంద, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిద్దామని వ్యాపారుస్తులకు కమిషనర్ ఖయ్యుం సూచించారు. మండల కేంద్రంలోని మునిసిపాలిటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం కిరాణ వ్యాపారస్తులు, ప్లాస్టిక్ విక్రయించే దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడంతో అటు ప్రజలకు, ఇటు పర్యావరణానికి ఇబ్బందికరంగా మారుతుందని తెలిపారు. ప్రతీ వ్యాపారస్తుడు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఖయ్యుం

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన
చర్యలు చేపట్టాలి

- ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలి
- మిల్లర్లు ధాన్యాన్ని వెంటవెంటనే దింపుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సదాశివనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టి ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సదాశివనగర్ మండలకేంద్రంతోపాటుగా మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండోల పరిధిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు టార్పాలిన్ కవర్లతోపాటు అవసరమైన సౌకర్యాలను కల్పించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున అవసరమైతే వరి కోతలు జరపకుండా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు పంపినవెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద ధాన్యం సం చులు దింపిన వెంటనే రిసిప్ట్ పొంది ట్యాబ్ ఎంట్రీ చేయాలని సెంటర్ ఇన్‌చార్జిలకు సూచించారు. జిల్లాలో 427 కేంద్రాలు ఉన్నాయని, గ్రేడ్ ఏ రకానికి రూ.2389, బీ గ్రేడ్ రకానికి 2369లు క్వింటాకు నిర్ణయించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన (మిగతా 8వ పేజీలో..)

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలూర క్యాంప్ శివారులో ఈనెల 2న ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయని బోధన్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం విజయ్ కుమార్ బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు.

రౌడీ షీటర్‌కు వారం జైలు

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగి న్యూసెన్స్ చేసిన మలవత్ కృష్ణ అనే రౌడీ షీటర్‌కు కోర్టు వారం జైలుశిక్ష విధించిందని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మద్యం తాగి న్యూసెన్స్ చేయడంతో అతడిపై పెట్టి కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి వారం జైలుశిక్ష పడిందని ఎస్ఐ వివరించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన గుగ్లోత్ మోహన్, అమృత్ రాథోడ్‌లను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా వారికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష పడిందని ఎస్ఐ చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి..

సుభాష్‌నగర్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి జైలు శిక్ష, 10మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందు హాజరుపర్చగా 10మందికి రూ.13వేల జరిమానా, ఆరుగురికి 2 రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

మాజీ మంత్రి తండ్రికి నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం ఉదయం మృతిచెందారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, ఆయన సతీమణి ఆయేషాఫాతిమా, బీఆర్ఎస్ జిల్లాధ్యక్షుడు జీవన్‌రెడ్డి తదితరులు సత్యనారాయణ మృతదేహానికి నివాళులు అర్పించారు.

విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): విజ్ఞానార్జనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని ఇంటర్ విద్య ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మదుమలాంచ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థిని విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఇంటర్ విద్యార్థులకు నవంబరులో సిలబస్ పూర్తి చేసి ప్రాక్టికల్స్‌కు సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, ప్రిన్సిపాళ్లు నికత్ కౌసర్, జాఫర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపీ అరవింద్ సమక్షంలో బీజేపీలో చేరిన బోధన్ యువకులు

బీజేపీ విజయానికి కృషి చేయాలి

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలో ప్రతి కార్యకర్త బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఎంపీ అరవింద్ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల యువకులు మంగళవారం ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ సిద్ధాంతాలు, అభివృద్ధి పనులు నచ్చి యువకులు భారీ సంఖ్యలో పార్టీలో చేరారని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





చినుకు పడితే చెరువే

▶▶ వానొస్తే ఆర్మూర్‌లో రోడ్లపైకి మురుగు ▶▶ పట్టించుకోని మునిసిపల్ అధికారులు ▶▶ పట్టణంలో ప్రజల అవస్థలు

పెర్కిట్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):చినుకు పడితే చాలు ఆర్మూర్‌లోని రోడ్లు చెరువుల్లా మారుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. వాన పడిన ప్రతిసారి వ్యాపార సముదాయాల్లోకి పూర్తిగా వర్షపునీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణం లోని బస్టాండ్ నుంచి మామిడిపల్లి చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి కృష్ణవేణి పాఠశాల వద్ద వర్షం ఏమాత్రం ఎక్కువ కురిసినా చెరువులా మారిపోతుంది. వారం కిందట కురిసిన వర్షానికి డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి వర్షపునీరు వెళ్లడానికి వీలులేక రోడ్లపైకి చేరింది. ఏటా సమస్య ఏర్పడుతున్నా మునిసిపల్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రతీసారి రహదారి చెరువులా మారడంతో బడులకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యర్థాలను వెంటనే తొలగించాలి

వర్షం పడిన ప్రతీసారి మా దుకాణం ముందు ప్రాంతం చెరువులా మారి డ్రైనేజీ వ్యర్థాలు వ్యాపారసముదాయాల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్నాం. పుర సిబ్బంది వ్యర్థాలను వెంటనే తొలగించాలి. రోడ్డుపైకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి.

- శ్రీనివాస్, స్థానికుడు

మురుగుకాలువల మరమ్మతులకు నిధులొచ్చాయి

ఆర్మూర్ మున్సిపాలిటీకి రూ.15 కోట్ల వరకు నిధులు మంజూరు అయ్యాయి. పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాలకు, పలు వార్డులలో డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మరమ్మతులతో పాటుగా రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా పక్కనే ఉన్న డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులకు రూ.50 లక్షల వరకు నిధులను కేటాయించనున్నాం. రానున్న వానాకాలం వరకు సమస్యను పరిష్కరిస్తాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

- రాజు, మునిసిపల్ కమిషనర్, ఆర్మూర్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

వెనకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

▶▶ ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

కోటగిరి,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి ఒడ్డెన్న సూచించారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ ప్రయోగ పరీక్షలు తప్పనిసరి నిర్వహించాలన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో కొనసాగుతాయని, విద్యార్థులను అందుకు అనుగుణంగా పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఎంసెట్, నీట్ పరీక్షలు రాయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రతి శనివారం మండలంలోని పలు జిల్లా పరిషత్ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కైసర్‌పాషా, అధ్యాపకులు ప్రమోద్, అనిల్, దత్తాత్రి పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలను స్మరించుకుందాం



బోధన్‌లో రక్తదానం ప్రతినిధులు

బోధన్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసులను స్మరించుకుందామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పోలీసులతో పాటు ఇతర స్వచ్ఛంద సంస్థల యువకులు, అధికారులు రక్తదానం చేశారు. 92మంది రక్తదాన శిబిరానికి హాజరై రక్తం అందజేశారని, ఆ యూనిట్లను రెడ్‌క్రాస్ సొసైటీకి అందిస్తామని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం గొప్పదని ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు, వై.శ్రీనివాస్, కొడాలి కిషోర్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అంజనేయులు, రాజశేఖర్, సీఐలు వెంకటనారాయణ, విజయ్‌బాబు, కృష్ణ, ఎస్ఐలు మచ్చేందర్ రెడ్డి, చంద్రమోహన్, సాయన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ పోరాటం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ జిల్లా 11వ మహాసభను నిర్వహించారు. సీఐటీయూ జెండాను సీనియర్ నాయకులు రామ్మోహన్ రావు ఆవిష్కరించారు. రాష్ట్రంలో కార్మిక సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ సీఐటీయూ వారికి అండగా నిలబడి పోరాటాలు చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే చట్టాలను 4కోడ్‌లుగా విభజించి కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను తీసుకువస్తుందని కార్మికుల కనీస వేతనాలు అమలు కాక ఉద్యోగ భద్రత లేక సతమతమవుతున్నారన్నారు. అసంఘటిత కార్మికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి అండగా ఉండాల్సిన బాధ్యత సీఐటీయూ నాయకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలపైన కార్మికులు కుల, మతాలు, ప్రాంతాలకు అతీతంగా సంఘటిత పోరాటాలు చేసినప్పుడే కార్మిక హక్కులు కాపాడబడతాయన్నారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య, జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్, కొండ గంగాధర్, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు, రాష్ట్ర వర్కర్ జిల్లా అధ్యక్షురాలు విజయ, పంచాయతీ జిల్లా కార్యదర్శి గంగాధర్, బీడీ యూనియన్ జిల్లాధ్యక్షుడు మోహన్, ఇరిగేషన్ జిల్లాధ్యక్షుడు గణేష్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

దుకాణాల్లో తనిఖీలు

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపార దుకాణాలలో తూనికలు, కొలతల శాఖ అధికారి సందీప్ కుమార్, సిబ్బంది మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో తక్కెళ్లను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరు లైసెన్స్‌లను కలిగి ఉండాలన్నారు. తూకంలో ఏ మాత్రం తేడా వచ్చిన కేసులు తప్పవని హెచ్చరించారు. ఎలక్ట్రికల్ కాంటాల్లోనూ కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలన్నారు. మోసాలకు పాల్పడకుండా వ్యాపారం చేసుకోవాలని, వినియోగదారులను ఇబ్బంది పెట్టవద్దన్నారు.



తక్కెళ్లను పరిశీలిస్తున్న అధికారులు



పుష్కరిణిలో పూజలు చేస్తున్న పురోహితులు



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

ఘనంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

భీమ్‌గల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ పూజారులు అంకుర్పాణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ప్రధాన అంశమైన అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకులు ద్వాదశపాత్రలలో సేకరించిన పుట్టమన్నులో బీజములను అలికి మొక్కలను మొలకెత్తించే కార్యమే అంకురార్పణలో ముఖ్య ఘట్టం. ఇలా మొలకెత్తిన మొక్కలు దేశంలో సర్వ సమస్యలు తొలగి అభివృద్ధి పొందడానికి సూచిక అని పండితులు పేర్కొన్నారు. అంతకు ముందు స్వామివారి గర్భాలయంలో ఉత్సవ ప్రారంభానికి సంకేతంగా అఖండ దీపారాధన, పుణ్యాహవచనం నిర్వహించి, శ్రీ మద్భాగవత పారాయణం చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ట్రక్‌షీట్లను రూపొందించాలి

▶▶ బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూరు,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయకూర్, రుద్రూర్ పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. సొసైటీలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ గురించి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ట్రక్ షీట్‌లను తప్పనిసరిగా రూపొందించాలని, రైస్ మిల్లులతో కార్యదర్శులు నిరంతరం సంప్రదింపులు జరపాలని కార్యదర్శులను ఆయన ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సత్యనారాయణ

ఏర్గట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భీంగల్ సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తాళ్ళరాంపూర్‌లో పోలీస్ అమరవీరుల స్మారక కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలను వాడకూడదని, నవ సమాజం నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ఏర్గట్ల ఎస్ఐ పడాల రాజేశ్వర్, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ వైస్ ప్రెసిడెంట్ గంగాధర్‌రెడ్డి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ రాజేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ముప్కాల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా మహిళలు షీటీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుల్స్ విగ్నేష్, సుమతి సూచించారు. మంగళవారం బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు ఈవ్‌టీజింగ్ వేధింపులకు గురైతే 8712659795 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. అదే విధంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఫీయోద్దిన్ అస్లాం, మురళి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితుడికి అండగా ఉంటాం



గంగాధర్‌తో మాట్లాడుతున్న నాయకులు

ఏర్గట్ల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం గల్ఫ్‌బాట పట్టి ఏజెంట్ చేతిలో జోర్డాన్ దేశంలో మోసపోయిన ఏర్గట్ల చెందిన వాల్గొట్ గంగాధర్‌కు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మండలాధ్యక్షుడు రాజాపూర్ణానందం పేర్కొన్నారు. మంగళవారం గంగాధర్‌ను ఇంటికి వెళ్లి అక్కడ ఎదుర్కొన్న బాధలను తెలుసుకున్నారు. గంగాధర్‌తో పాటు మరికొందరు స్వదేశానికి రావడానికి మాజీ మంత్రి హరీష్‌రావు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మధుసూదన్, గ్రామశాఖ అధ్యక్షుడు నర్సయ్య, బద్దం శ్రీనివాస్ రెడ్డి, లక్కం నర్సయ్య పాల్గొన్నారు.

నేడు సాఫ్ట్‌బాల్ ఎంపికలు

ఆర్మూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల క్రీడా మైదానంలో బుధవారం పురుషుల జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపిక చేయనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి మర్కంటి గంగమోహన్ తెలిపారు. అదేవిధంగా సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల క్రీడా మైదానంలో మహిళల జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్టును మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు జిల్లా కోచ్‌లు నరేష్, మౌనికలకు రిపోర్టు చేయాలని కోరారు. మహిళల జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7వ తేదీ నుంచి జగిత్యాల జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలి

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. కాలనీలోని పలు వీధులలో చెత్త కుప్పలు రోడ్ల పక్కన పేరుకుపోయ్యాయని వారు పేర్కొన్నారు. పలు చోట్ల వీధి కుళాయిలకు బిరడాలు లేకపోవడంతో కుళాయి నీరు వృథాగా వెళ్తుందని వారు వివరించారు. వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తగినంత సిబ్బందిని నియమించాలి

భీమ్‌గల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కార్యాలయంలో తగినంత సిబ్బంది నియమించాలని తెలంగాణ ప్రగతిశీల మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రాజేశ్వర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. మునిసిపల్ కార్యాలయంలో తగినంత సిబ్బంది లేనందున ఉన్న కొద్దిమందిపై పనిభారం పడుతుందన్నారు. వెంటనే సరిపడా సిబ్బందిని నియమించి తమ ఇబ్బందులు తొలగించాలన్నారు. అలాగే కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌ను కోరారు. ఆయన వెంట పలువురు మునిసిపల్ కార్మికులు ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సిబ్బంది

అయోడైజ్డ్ ఉప్పు ఆరోగ్యానికి మేలు

మోర్తాడ్ అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అయోడైజ్డ్ ఉప్పు వినియోగించడం ద్వారా అయోడిన్ లోపాన్ని నివారించవచ్చని కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరసింహస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మోరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. అయోడిన్ ప్రాధన్యత, శరీర అభివృద్ధి, మేధస్సు అభివృద్ధిలో అయోడిన్ చేసే కీలక పాత్రను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యలు, లక్షణాలు నివారణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘునందన చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

నేటి నుంచి సప్తాహ

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ చారిత్రక విఠలేశ్వర ఆలయంలో బుధవారం నుంచి అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభం కానుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 5న జరిగే కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో జాతర ఉంటుందన్నారు. దీనికి సంబంధించి వారం పాటు ఆలయంలో అఖండ హరినామ సప్తాహతో పాటు ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు.

ఏటీఎం సెంటర్ ప్రారంభం

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో కెనరా బ్యాంక్ ఏటీఎంను మంగళవారం బ్యాంక్ సీనియర్ మేనేజర్ మధు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక కెనరా బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏటీఎంలో డబ్బులు డ్రా చేయడంతో పాటు జమ చేయడానికి సైతం అనుకూలంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అరవింద్, సంజీవ రావు, ప్రసాద్, భూమయ్య, నరేందర్, మల్లేష్‌తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆలూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లోకరాంరెడ్డి కుమార్తె నవ్యరెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి నవ్యరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, ఓబీసీ రాష్ట్ర నాయకులు యాదగిరి , ప్రణీత్ గౌడ్, సురేష్ యాదవ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రాంరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ అర్వింద్

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

వేల్పూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాన్కంపేట్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన కొలిప్యాక సత్యంరెడ్డి -వజ్ర (గంగు) దంపతులు దుప్పట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందజేయడానికి తాము ముందుంటామని సత్యంరెడ్డి అన్నారు. సత్యంరెడ్డి దంపతులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

బ్యాడ్జీల అందజేత

ఆర్మూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్బిర్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక గోల్డెన్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు బ్యాడ్జీలను అందజేశారు. బ్యాడ్జీలను అందజేసిన యూత్ సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రాటం సాగర్, సీహెచ్ గంగాధర్, జి.రాజు, ఎనుగందుల ఉదయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



నీలాలో గోమాతకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

రెంజల్,అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా గ్రామంలో హనుమాన్ మందిరానికి చెందిన గోమాత మంగళవారం మరణించడంతో గ్రామస్థులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. వారం రోజుల క్రితం కుక్కకాటు వల్ల గోమాతకు రేబీస్ వ్యాధి సోకడంతో వారం పాటు చికిత్స నిర్వహించిన అనారోగ్యానికి గురై మరణించింది. గ్రామంలోని హనుమాన్ మందిరం నుంచి భాజభజంత్రీలతో ఊరేగింపుతో గ్రామ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యోగేష్, గ్రామ పెద్దలు రాఘవేందర్, గంగాధర్, సాయన్న, భాస్కర్, గణేష్, మహేష్, స్నేహిత్, రమేష్ తదితరులున్నారు.

పశువులకు టీకాలు

మోర్తాడ్, జక్రాన్‌పల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండలం ధర్మోరాలో మంగళవారం 73ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గౌతమ్‌రాజు తెలిపారు. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ, బ్రాహ్మణ్‌పల్లిలో 588 పశువులకు టీకాలు వేసినట్లు ఏడీ డాక్టర్ గంగాధర్, పశు వైద్యాధికారి డాక్టర్ అశితరెడ్డి తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి

నసురుల్లాబాద్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో సంఘం ప్రతినిధులు మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడి 68 ఏళ్ల అవుతుందని ఈ ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించుకున్నామన్నారు. ధర్మబిక్షం, ఎస్ఆర్‌దాట్ల మల్లయ్య, తొట్ల మలుసూరు లాంటి అనేకమంది అమరవీరుల స్ఫూర్తితో ఈ సంఘం దీక్షతో పని చేస్తుందన్నారు. నవంబర్ 11న కామారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని కోరారు. నవంబర్ 28, 29, 30వ తేదీల్లో సూర్యాపేటలో జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్, నాయకులు యాదగిరి గౌడ్, నర్సింహులు గౌడ్, దత్తాగౌడ్, వేణుగౌడ్, రామగౌడ్, యాదగిరి గౌడ్, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.


సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

బీర్కూర్, బాన్సువాడ రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్, చించోల్లి, బాన్సువాడ గ్రామీణ మండలం కొల్లూరు గ్రామాల్లో పర్యటించారు. గత 2 రోజుల పాటు కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి డీఎస్‌వోతో ఫోన్‌లో మాట్లాడారు. లారీలకోసం ఎదురు చూడకుండా తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటవెంటనే ట్రాక్టర్లలో రైస్ మిల్లుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది కలిగించకుండా రైస్ మిల్లర్లు సైతం వెంటనే ధాన్యం బస్తాలను దింపుకోవాలన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.


కిష్టాపూర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అంగన్‌వాడీలతోనే చిన్నారుల పోషణ

పెద్దకొడప్‌గల్, అక్టోబరు28, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేస్తుంది అంగన్‌వాడీ కార్యకర్తలేనని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన పోషకమాసం సమావేశానికి హాజరై ప్రసంగించారు. సమాజంలో మహిళలు, చిన్నారుల పోషణ అంగన్‌వాడీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మద్నూర్ క్లస్టర్ ద్వారా 5 మండలాల్లో శిశు సంక్షేమ శాఖ ద్వారా 39,129 కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయన్నారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. జిల్లా స్త్రీసంక్షేమ శాఖ అధికారి ప్రమీల, తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో అభినవ్ చందర్,ఇంచార్జి సీడీపీవో కళావతి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

● పెద్దకొడప్‌గల్‌లో ఏర్పాటుచేసిన మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం గడుల ఇళ్లలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు రూ.33 లక్షలతో నిర్మిస్తున్న 30 వేల లీటర్ల సామర్థ్యం గల సంప్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పిట్లం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో రఘు అన్నారు. మంగళవారం పిట్లం మండలకేంద్రంలోని పలువురు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ వేసి మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు హనుమాండ్లు, కార్యదర్శి బలరాం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీర్కూర్ ఎంపీడీవోగా శ్రీనిధి

బీర్కూర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల నూతన ఎంపీడీవోగా శ్రీనిధి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి బీర్కూర్ ఎంపీడీవోగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధిహామి పనులు, హరితహారం, స్వచ్ఛ భారత్, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాల పురోగతిని సమీక్షించారు. బీర్కూర్ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని అన్నారు. అనంతరం ఆమెకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

తాడ్వాయి, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రఘునందన్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్కల్, తాడ్వాయి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మార్కింగ్ ఇచ్చారు. అర్హులైన లబ్ధిదారులు ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణాజివాడి గ్రామంలోని కొనుగోలు సెంటర్‌ను పరిశీలించారు. మండల అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫ్రెండ్స్ యూత్ క్లబ్

పిట్లం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొనేందుకు వెళ్తున్న మండలకేంద్రానికి చెందిన క్రీడాకారుల బృందానికి ఫ్రెండ్స్ యూత్ క్లబ్ తరఫున మంగళవారం ఆర్థికసాయం అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు బొడ్ల శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెళ్తున్న బృంద సభ్యులు విజయం సాధించాలని కోరుతూ తమవంతు సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సంతోష్, బాలకృష్ణ, ధర్మవీర్, సురేందర్, పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. అన్నదాతల ఆందోళన


అకాల వర్షానికి తడిసిన ధాన్యం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్, ఇబ్రహీంపేట్, రాంపూర్, పోచారం, దేశాయిపేట్, బోర్లం, జుక్కల్‌దాని తాండా గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎండబెట్టిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో ఇప్పటికే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడంలో అప్పులు కూరుకుపోవడం, తడిసిన ధాన్యంతో మరింత నష్టపోతున్నామని ఆందోళనకు గురవుతున్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి అధికారులు టార్పాలిన్లు ఇవ్వకపోవడం, వ్యవసాయశాఖ అధికారులు సూచనలు చేయకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేసి తడిసిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

డబ్బులు ఎవరికీ ఊరికే రావు



సాంకేతికత రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతున్న క్రమంలో సైబర్‌నేరాలు పెచ్చుమీరుతున్నాయి. మొబైల్ ఫోన్లకు ఆఫర్ల పేరిట లింకులు పంపిస్తూ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. అమాయక ప్రజల నుంచి అధికారుల వరకు చాలామంది ఈ సైబర్ మోసాల ఉచ్చులో పడుతున్నారు. పోలీసుశాఖ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇంకా మోసాలు ఆగడంలేదు.

- రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఆఫర్ల పేరిట మాయమాటలు
- ఖాతాల్లోంచి నగదు మాయం చేస్తున్న కేటుగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

దోమకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతూనే ఉన్నారు. ప్రధానంగా దోమకొండ, రాజంపేట్, బీబీపేట, కామారెడ్డి మండలాల్లోని పలువురు ఇటీవల ఫేక్‌మెసేజ్‌లకు స్పందించి రూ.వేలల్లో డబ్బులు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. అలాగే లింక్‌లు పంపించి మీ నంబర్‌పై లక్కీడ్రాలో బహుమతులు వచ్చాయి, పూర్తి వివరాలను తెలుసుకోవాలంటే లింక్‌ను క్లిక్ చేసి ఓటీపీ చెబితే వివరాలు వస్తాయని నమ్మిస్తారు. దేనికైనా స్పందించి ముందుకెళ్తే నగదు పోగొట్టుకునే పరిస్థితి తప్పదు.

● రెండేళ్ల క్రితం మండలంలోని ఓ వ్యక్తికి మీ భూమిలో సెల్ టవర్ ఏర్పాటుకు అగ్రిమెంట్ పూర్తయిందని, ఆఫీస్ పనులు పూర్తయ్యాయని డాక్యుమెంట్ చార్జీలకు రూ.5 వేలు పంపిస్తే వెంటనే కంపెనీ అగ్రిమెంట్ డబ్బులు రూ. 10 లక్షలు మీ బ్యాంక్‌లో వేస్తామన్నారు. వారి మాటలు నమ్మి మోసపోయారు. అలాగే మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి మాయమాటలు చెప్పి నుంచి రూ. 24,900 బ్యాంక్ ఖాతాల్లోంచి చోరీ చేశారు.

టోల్ ఫ్రీ నంబర్లు ఇవే..

ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 155260, 100కి కాల్ చేసి 24 గంటల్లోపు తెలిపితే డబ్బులు ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

జాగ్రత్త పాటిస్తే నగదు సేఫ్..

దోమకొండకు చెందిన ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఐడియా టవర్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని పరిచయం చేసుకున్నారు. మీ స్థలంలో సెల్ టవర్ వేస్తామని మాయామాటలు చెప్పి పూర్తి వివరాలు, వ్యవసాయ భూములు సర్వే నంబర్లను పంపించమని మాటలతో బురిడీ కొట్టించారు. రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి మీ ఇంటిపై, వ్యవసాయ భూమిలో టవర్ వేసేందుకు అగ్రిమెంట్ అయినట్లు చెప్పి ఆధార్ నంబర్ ఎంట్రీ చేస్తామని నమ్మించి బ్యాంక్ వివరాలను రాబట్టేందుకు ప్రయత్నించారు. అగ్రిమెంట్ చార్జీలకు డబ్బులు పంపించాలని అడగగా మోసపోతున్నామని గ్రహించి సదరు కుటుంబీకులు ఆ నంబర్‌ను బ్లాక్ చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో వచ్చే మెసేజ్‌లకు స్పందించొద్దు. నిజాలు తెలుసుకున్నాకే రిప్లై ఇవ్వాలి. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వొద్దు. భిక్కనూర్ సర్కిల్ పరిధిలో 25 ఆన్‌లైన్ మోసాలకు గురైన కేసులు నమోదయ్యాయి.
- సంపత్ కుమార్ సీఐ, భిక్కనూర్

బ్యాంక్ వివరాలు ఇతరులకు చెప్పొద్దు



బ్యాంక్ నుంచి అధికారిని మాట్లాడుతున్నానని మీ ఏటీఎం రిన్యూవల్ చేస్తామని మీ మొబైల్‌కి ఓటీపీ వస్తుందని, అది చెప్పాలని అడిగితే ఎలాంటి సమాచారం చెప్పొద్దు. అలాగే లక్కీడ్రాల పేరిట బహుమతులు గెలుచుకున్నారని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అత్యాశకు గురిచేస్తారని అలాంటి మాటాలు నమ్మి మోసపోవద్దు.
-ప్రవంతి ఎస్సై, దోమకొండ

రవాణా సమస్యలు పరిష్కరించాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28, (ఆంధ్ర జ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంగళవారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి వినతిపత్రం అందించారు. బస్సు కొరత, గ్రామీణ ప్రాంతాలకు తగిన సర్వీస్‌లు లేకపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మరిన్ని బస్సులు కేటాయించాలని, ఎల్లారెడ్డిలో ఆర్టీసీ డిపోను నెలకొల్పాలని వివరించినట్లు తెలిపారు. ఎండీ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని చెప్పారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

సీఎం దిష్టిబొమ్మతో ఊరేగింపు

ఇందల్వాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో వర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించి గేట్‌కు ఉరితీశారు. యూనివర్సిటీ అధ్యక్షుడు పృథ్వీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరి కారణంగా రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో 2 సార్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని బంద్‌కు పిలుపునివ్వడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా పూర్తి బకాయిలను చెల్లించి పేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. యూనివర్సిటీ కార్యదర్శి సమీర్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల పూర్తి స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబెర్ అమృత్ చారి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్, ఉపాధ్యక్షులు అక్షయ్, అశోక్, అజయ్, మనోజ్, సంయుక్త కార్యదర్శులు అనిల్, అఖిల్, మీడియా ఇంచార్జి కార్తీక్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

రాజకీయ ప్రతినిధులకు ఎన్నికలపై శిక్షణ

మద్నూర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో జుక్కల్ నియోజకవర్గ ఈఆర్‌వో (ఓటరు నమోదు అధికారి), జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.విక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్‌లలో బీఎల్‌వోలకు సహకరించాలని, రాజకీయ పార్టీల బూత్ లెవెల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలని సూచించారు. అనంతరం నియోజక వర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఓటరు జాబితా ప్రత్యేక పునఃసమీక్ష షెడ్యూల్ ఇచ్చినందున దానిపై పకడ్బందీగా, తప్పులు జరగకుండా సమీక్ష చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు ఎండీ ముజీబ్, బి.అనిల్, వేణుగోపాల్ గౌడ్, లత, బిక్షపతి, మారుతి, రాజా నరేందర్ గౌడ్, నాయబ్ తహసీల్దార్‌లు శరత్, హేమలత, శివ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు డి సాయిలు, టి సంతోష్, బస్సీపటేల్, రోహిదాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

పిట్లం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను డీఎల్పీవో ప్రసాద్ రావు మంగళవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఓ వ్యాపారి జీప్లస్టు నిర్మాణానికి పర్మిషన్ తీసుకొని 3జీ ప్లస్ నిర్మాణ పనులు చేపడుతున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చిందన్నారు. నిర్మాణ దారుడు నిబంధనలు పాటించకుండా అక్రమంగా నిర్మిస్తున్నందున నివేదికలు సిద్ధం చేసి ఉన్నతా అధికారులకు పంపిస్తామన్నారు. ఎవరూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని తెలిపారు.

దారులే కల్లాలై.. ప్రయాణానికి కళ్లెమై

- రహదారులపై ధాన్యం ఆరబోత
- రక్షణగా రాళ్లు, ముళ్ల కంచెలు
- పయాణికులకు తప్పని ఇక్కట్లు

మద్నూర్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలోని పల్లెల్లోని రహదారుల పై కొందరు సోయా, వరి ధాన్యం ఆరబోస్తుండటం ప్రమాదకరంగా మారింది. పైగా వాటికి రక్షణ గా రాళ్లు, ముళ్లకంచెలు వేస్తున్నారు. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే వారికి ప్రాణ సంకటంగా మారుతుంది. అటుగా వచ్చే వాహనాల డ్రైవర్లు ఏ కొంచెం ఏమరపాటు వహించినా ప్రమాదాలే చోటుచేసుకునే అవకాశం ఉంది.

సగం రోడ్డు వరకు ధాన్యమే

10 ఫీట్ల వెడల్పు ఉన్న సింగిల్ రోడ్డులో సగం వరకు ధాన్యం ఆరబోస్తుండటంతో భారీ వాహనాల మాట దేవుడెరుగు, బైక్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంది. రోడ్ల వెంట వాహనాలు వస్తాయన్న విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. రాత్రి సమయంలో రోడ్లపై ఉంచిన రాళ్లు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ధాన్యం ఆరబోతకు స్థలం కేటాయించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


రోడ్డుపై ఆరబోసిన సోయా పంట

ఊరంతా చీరలు పంచుతూ వివాహానికి ఆహ్వానం

దోమకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాను పుట్టి పెరిగిన గ్రామస్తులందరి సమక్షంలో తన కుమారుడి వివాహం వైభవంగా జరిపించుకోవాలనే కోరికతో తన గ్రామంలోని ప్రతీ ఇంటికి బ్యాగులో పెళ్లి కార్డు.. చీర పెట్టి గ్రామస్థులందరికీ ఆహ్వానం పలికాడు జనగామ గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డి. మహిళలకు చీరలతోపాటు వివాహ పత్రికలను అందజేస్తు తన కుమారుని వివాహానికి వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించాలని కోరు తూ మంగళవారం సీతారాంపల్లి, జనగామ గ్రామాల్లో అందజేశారు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి. తన కుమారుడు నిహాంత్‌రెడ్డి-హర్షిత వివాహం వచ్చేనెల 7వ తేదీన శంశాబాద్ హైదారాబాద్‌లోని జీఎంఆర్ అరినా ఫంక్షన్‌హల్ జరుగనుండగా.. గ్రామంలో సుమారు 11 వందల మందికి పైగా మహిళలు ఉండగా వారందరికీ పెళ్లి కార్డుతోపాటు చీరలను పంపిణీ చేశారు. వివాహానికి రావాలని కోరారు. కార్యక్రమంలో మట్ట శ్రీనివాస్, సైదుగారి ఆశోక్‌గౌడ్, కప్పెర రవిందర్‌రెడ్డి, జీవన్ రెడ్డి, స్వామి, పీఆర్పీ పాత స్వామి, జలిగామ నాంపల్లి, సిద్దరాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరీక్షల తేదీలు విడుదల

ఇందల్వాయి, అక్టోబరు28, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వ విద్యాలయ పరిధిలో పీజీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్స్ (ఏపీఈ, ఐపీసీహెచ్) ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు నవంబర్ 6 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తామని కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలిపారు.

ఎల్లారెడ్డి ఎంపీడీవోగా తాహెరాబేగం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల నూతన ఎంపీడీవోగా తాహెరా బేగం మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గత 10 నెలలుగా ఇంచార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ప్రకాష్ పూర్తిస్థాయి ఎంపీడీవోగా నియమితులైన సందర్భంగా తాహెరా బేగంకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆమెకు కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు స్వాగతం పలికారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏఎంసీ చైర్మన్ రజిత ప్రారంభించారు.రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెంది దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు గంగారెడ్డి, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింలు, గోపికృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఈ నెల 24వ తేదీ నుంచి జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ జమదగ్ని, చింతల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవ వేడుకల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. సాయంత్రం ఎల్లమ్మ బోనాల ఊరేగింపు కార్యక్రమం పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, కిసన్‌గౌడ్, సిద్దాగౌడ్, ఆఫీస్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ ఎండీపీవోగా అభినవ్

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ ఎంపీడీవోగా అభినవ్ చందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ ఉద్యోగం కొత్తదైనా రానున్నరోజుల్లో మండలంలోని ఆయా గ్రామాలలో పర్యటించి ప్రజలతో మమేకమై సమస్యలు లేకుండా చూస్తానని తెలిపారు.

లా స్పాట్ అడ్మిషన్లకు అనుమతివ్వాలి

ఇందల్వాయి, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా.రామావత్ లాల్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ బాల కృష్ణారెడ్డిని కలిసి తెలంగాణ యూనివర్సిటీలోని ఖాళీగా ఉన్న లాసీట్ల భర్తీకి అనుమతి ఇవ్వాలని వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వర్సిటీలో ఖాళీగా ఉన్న లాఅడ్మిషన్లను భర్తీ చేయడంతో నిజామాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతంలో లా చదువుకునే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అన్నారు.

కనువిందు చేస్తున్న నిజాంసాగర్ ప్రాజెక్టు



ప్రాజెక్టు అంతర్భాగంలో నీటిలో ఉన్న చిత్రినౌక బంగ్లా



ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

» జిల్లా నలుమూలల నుంచి ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న పర్యాటకులు

» ప్రాజెక్టు పరిసరాల్లో వనభోజనాలతో సందడి

నిజాంసాగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారి పర్యాటకులను కనువిందు చేస్తోంది. గత ఆగస్టు 18 నుంచి వర్షాలు కురుస్తుండగా దాదాపుగా ప్రాజెక్టులోకి 210టీఎంసీల నీరు వచ్చి చేరగా దాదాపు 189టీఎంసీల నీటిని మంజీరా నదిలోకి అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు నుండి నీటి విడుదల ఇంకా కొనసాగుతూనే ఉండటంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా హైదారాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులోని పర్యాటకులు తండోపతండాలుగా నిజాంసాగర్ అందాలను తిలకించడానికి పెద్దఎత్తున తరలివస్తున్నారు. దీంతో ప్రాజెక్టు పరిసరాలన్ని పర్యాటకుల వనభోజనాలతో కిటకిటలాడుతోంది. నిజాంసాగర్ అందర్భాగంలో ఉన్న చిత్రినౌక బంగ్లాను పర్యాటకులను కనువిందు చేస్తోంది. ప్రాజెక్టు నిండుజలాల మధ్య తొలిసలాడుతున్న ఈ బంగ్లాను పర్యాటకులు ఆసక్తిగా తిలకిస్తూ ఆనందంగా గడుపుతున్నారు. నిజాంసాగర్ వరద గేట్లను తిలకించడంతో పాటుగానీటిని చూస్తూ ఆనందిస్తూ కేరింతలు కొడుతున్నారు. ముఖ్యంగా ఆదివారం, సెలవు దినాల్లో పర్యాటకుల సందడి చాలా ఎక్కువగా ఉంటోంది. నిజాంసాగర్ ఎగువప్రాంతం నుండి నీరు రావడంతో వీఆర్ నెంబర్ 5వ గేటు నుంచి 5760 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి అధికారులు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఆగష్టు, సెప్టెంబరు నెలల్లోనే ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిపోగా ప్రాజెక్టును నమ్ముకున్న ఉభయ జిల్లాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో పర్యాటకులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలను కల్పించాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

అడ్లూర్‌లో అంధకారం

» రెండో వార్డులో వెలగని వీధిదీపాలు

» అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

కామారెడ్డి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి గ్రామీణ ప్రాంతంగా ఉన్న అడ్లూర్ కామారెడ్డి మున్సిపల్‌లో కలిశాక అభివృద్ధికి దూరమవుతుందనే ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రెండో వార్డులోని అడ్లూర్‌లో ప్రధాన రహదారి, కామారెడ్డి నుంచి అడ్లూర్‌కి ప్రవేశించే రోడ్డు మార్గంలో వీది దీపాలు వెలుగక దాదాపు మూడు నెలలు గడుస్తున్నా మున్సిపల్ సిబ్బంది అటూవైపు కన్నేతి చూసిన దాఖలాలు లేవు. వార్డులో వీది దీపాల సమస్య ఉందని పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. దీంతో రోడ్ల పక్కన ఎత్తాచెదారం, డ్రైనేజీలు అపరిశుభ్రంగా ఉండడంతో రోడ్ల పైకి రాత్రి సమయంలో విషపురితమైన పాములు వస్తున్నాయని కాలనీ ప్రజలు అందోళన చెందుతున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు దృష్టి సారించి వీది దీపాల సమస్యలను పరిష్కరించే విధంగా మున్సిపల్ అధికారులను అదేశించాలని వార్డు ప్రజలు కోరారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



విద్యాశాఖ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో జీతం తీసుకునేందుకు ప్రయత్నించిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు విద్యాశాఖ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించి విధులకు హాజరుకాకుండా బాలాజీ అనే ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు ఫోర్జరీ సంతకాలతో జీతభత్యాలు తీసుకునేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. గతంలో పలుమార్లు సస్పెండ్ అయిన సదరు ఉపాధ్యాయుడు నెలల వ్యవధిలోనే డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్తున్నాడని తెలిపారు. బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లాధ్యక్షుడు అరుణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లాధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్

కామారెడ్డి రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ బీజేపీ ఎస్టీ మోర్చా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మంగళవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ పటిష్టతకు కలిసి ముందుకు సాగాలన్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా పట్టణాధ్యక్షుడు వినోద్, ఉపాధ్యక్షుడు రాములు, ప్రవీణ్, ప్రశాంత్, రాథోడ్ అనిత్, నవీన్, ప్రధాన కార్యదర్శిగా నవీన్, కార్యదర్శులుగా రవి, సంజు, ఆనంద్, రవీందర్, క్యాషియర్‌గా గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

పట్టణ మహిళా మోర్చా కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి పట్టణ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా బాలమణి, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మీ, కౌసల్య, వరలక్ష్మీ, రేణుక, అనసూయ, ప్రధాన కార్యదర్శులుగా అక్షయ, రజిత, కార్యదర్శులుగా రత్నం, ప్రమీల, లావణ్య, హేమలత, క్యాషియర్‌గా జ్యోతి, కార్యవర్గ సభ్యులు సరిత, సురేఖ, రాణి, అరుణ, లింబవ్వ, సిద్దవ్వ, నందిని, అనిత, సుశీల లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉనికి కోసమే కాంగ్రెస్ డ్రామా



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి

సదాశివనగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ చేరికల పేరుతో డ్రామా ఆడుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఒక ఎమ్మెల్యే హోదాలో మదన్‌మోహన్‌రావు సదాశివనగర్ నుంచి 70మంది బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారని చెప్పడం సిగ్గుచేటన్నారు. వేరే పార్టీల కార్యకర్తలను, నాయకులను ప్రలోభాలకు గురి చేయకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నారు. జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను సన్మానించిన ఎస్పీ




కానిస్టేబుల్ కస్తూరిని శాలువా కప్పి సన్మానిస్తున్న ఎస్పీ

కామారెడ్డిటౌన్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల నిర్వహించిన టీఎస్‌పీఎస్ పరీక్షల్లో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించిన నేనవత్ కస్తూరిని ఎస్పీ రాజేష్‌చంద్ర మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కస్తూరి కృషి, పట్టుదలతో చిన్ననాటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉన్నత ఉద్యోగం సాధించడం అభినందనీయమని తెలిపారు.

దాబాలలో మద్యం సిట్టింగ్‌లు పెడితే చర్యలు

దాబాలలో మద్యం సిట్టింగ్‌లు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాజేష్‌చంద్ర హెచ్చరించారు. నిజాంసాగర్ మండలం మాగి గ్రామ శివారులోని బేడిల మైసమ్మ దాబా యాజమాని శంకర్‌కు తహసీల్దార్ వద్ద బైండోవర్‌తో పాటు రూ.50 వేల జరిమానా విధించామన్నారు.

ప్రాజెక్టుకు తగ్గిన వరద



నీటిని విడుదల చేస్తున్న అధికారులు

నిజాంసాగర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద నీరు తగ్గుముఖం పడుతుందని డిప్యూటీ ఈఈ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాటికి ప్రాజెక్టులోకి 3548 క్యూసెక్కుల వరద వస్తుందన్నారు. దీంతో వీఆర్ నంబర్-5 లోని గేటును ఎత్తి మంజీరా నదిలోకి విడుదల చేశామన్నారు. ప్రాజెక్టులో 1405అడుగుల నీటి మట్టం నిల్వ ఉండగా, ఈ ఏడాది సాగునీటి కొరత లేదని వివరించారు.

ఉద్యోగుల సమస్యలపై దృష్టిసారించాలి

కామారెడ్డిటౌన్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన కేంద్రసంఘ కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన ఉద్యోగులకు ఈహెచ్ఎస్ పథకాన్ని రూపకల్పన చేసి అమలు అయ్యేవిధంగా చూడాలని, పెన్షనర్ బెనిఫిట్స్ రాక చాలా ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. పీఆర్‌సీ సమయం ముగిసి సంవత్సరాలు గడుస్తుందని గుర్తుచేశారు. వెంటనే అన్ని రకాల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు, కేంద్రసంఘసభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డబ్బులను అందజేస్తున్న కాలనీ వాసులు

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

భిక్కనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన తుడుం రాజమణి అంత్యక్రియల నిమిత్తం కాలనీవాసులు మంగళవారం మృతురాలి భర్త భూషణంకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో ఎవరు మరణించిన వారికి కాలనీవాసులందరం అండగా ఉండి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్సలు



ఫిజియోథెరఫీ చేస్తున్న వైద్యుడు నవీన్

భిక్కనూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం వైద్యుడు నవీన్‌సాయి దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, వైద్యుడు నవీన్‌సాయి మాట్లాడుతూ విద్యార్థులకు ఫిజియోథెరఫి చేయడంతో మానసిక ఉపశమనం కలుగుతుందని, వీరిని క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ శిబిరానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం భవాని, ఐఆర్పీ మహేందర్ ఉన్నారు.

పాఠశాలలో బోర్లు వేయించిన మాజీ ఎంపీటీసీ



బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ

పాల్వంచ, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మంగళవారం మా జీ ఎంపీటీసీ కూచని లావణ్య శేఖర్ సుమారు రూ.2లక్షలు వెచ్చిం చి రెండు బోర్లు వేయించారు. ఉన్నత పాఠశాలలో నీటికోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి పాఠశాలలో బోర్లు వేయించినట్లు మాజీ ఎంపీటీసీ తెలిపారు. ఈ మేరకు మాజీ ఎం పీటీసీ దంపతులకు పాఠశాల హెచ్ఎం గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్ అని త, గ్రామస్థులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, బాలలింగం, శ్రీనివాస్‌గౌడ్, తోట బాల్‌రాజు, శివునిగౌడ్, అనీల్, రాము, ఎల్లయ్య, రమేష్, నాగరాజం పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శివ

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

దోమకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగుపల్లి గ్రామంలో మంగళవారం మండల పశువైద్యాధికారి శివ పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో 42 గేదెలకు, 8 ఆవులకు గాలికుంటే నివారణ టీకాలు వేసినట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నవంబరు 14 వరకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, ఇర్ఫాన్, గంగారాం, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేత

దోమకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అర్డర్‌కాఫి అందజేశారు. ఇంటి నిర్మాణానికి మ్యాప్ ఇచ్చి ముగ్గుపోయించారు. అనంతరం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రుణాలు

● స్పెషల్ ఆఫీసర్ జ్యోతి

దోమకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరై డబ్బు లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష రుణాలను అందజేసి ఇళ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా చూడాలని మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి అన్నారు. మంగళవారం మండల సమాఖ్య భవనంలో సీఏలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సంఘాల సభ్యులకు అందేవిధంగా కృషి చేయాలన్నారు. ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందడానికి సమాఖ్య ద్వారా రుణాలు పొంది డబ్బులు పొదుపు చేసుకోవాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లిస్తూ గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రామక్రిష్ణా, రవి, సీఏలు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్యలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్

మానసిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యసేవలు

రాజంపేట, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం మానసిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యసేవలు అందించినట్లు జిల్లా మానసిక వైద్యాధికారి రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు అవసరం మేరకు అవగాహన, కౌన్సిలింగ్ సైతం ఇవ్వడం జరిగిందని తెలిపారు. మతిమరుపు, నిద్రలేమి, అతినిద్ర, ఫిట్స్, అతికోసం, ఆత్మహత్య ప్రేరే పిత ఆలోచనలు అధిగమించాల్సిన తీరు,ఆల్కహాల్ సంబంధిత వాటిని మనేందుకు తగిన చికిత్స అందిస్తామని తెలిపారు. సోషల్ వర్కర్ రాహుల్, డాక్టర్ విజయమహాలక్ష్మీ, సూపర్‌వైజర్ మంజూర్, స్టాఫ్‌నర్స్ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

భిక్కనూరు, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని భిక్కనూరు ఎస్సై అంజనేయులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే ఈ శిబిరంలో యువకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని, ఆసక్తి గల వారు ఉదయం 9గంటలకు పోలీసుస్టేషన్‌కు చేరుకోవాలని సూచించారు. అన్నిదానాల్లో రక్తదానం చాలా గొప్పదానమని తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కే-ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బీసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి	బైసన్
వెంకటేశ్వర	కె - ర్యాంప్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ధాన్యం కొనుగోళ్లపై నిఘా

(5వ పేజీ తరవాయి)

ప్రణాళికలను రూపొందించి కొనుగోళ్లను చేపడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం కొనుగోలు కేంద్రాలతోపాటు ధాన్యం కేటాయించిన రైస్‌మిల్లులపై నిఘా పెట్టింది. జిల్లా వ్యాప్తంగా 427 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్నిపలు రైస్‌మిల్లులకు అలర్ట్‌మెంట్ చేశారు. కొనుగోలు కేంద్రాలలో, రైస్‌మిల్లులో తరుగు తీయకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతుల నుంచి సరైన ధృవపత్రాలు తీసుకోవడంతో పాటు కేంద్రాల నిర్వహకులు వేబిల్లులు ఇవ్వడం అందులో పొందుపరిచిన ధాన్యం తూకం మిల్లులకు వెళ్లె సరికి సమానంగా ఉందా లేదా అనే దానిపై అధికారులు నిఘా పెట్టారు. మంగళవారం సదాశివనగర్ మండల కేంద్రం, రామారెడ్డిలోని ఉప్పల్‌వాయి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు.అదేవిధంగా మద్నూర్ మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును అదనపు కలెక్టర్ విక్టర్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా

ఈ వానకాలం సీజన్‌లో జిల్లాలో 2 లక్షల ఎకరాలకుపైగా రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రధానంగా నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ దిగువన నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, నస్రూళ్లబాద్, పోచారం ప్రాజెక్టు కింద ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాలతో పాటు మాచారెడ్డి, దోమకొండ, కామారెడ్డి మండలాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ లెక్కన వానకాలంలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని, వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులు అంచనా వేశారు. అయితే కొనుగొళ్ల కేంద్రాలకు 4.80 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ వానకాలం సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 427 కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 22 వేల 282 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు సంబంధిత శాఖధికారులు చెబుతున్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలి

(5వ పేజీ తరవాయి)

లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చడంలో పేదప్రజలకు శాశ్వత నివాసం కల్పించడమే లక్ష్యంగా ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అంతకుముందు ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డీఆర్వో మదన్‌మోహన్, డీసీవో రాంమ్మోహన్, క్లస్టర్ అధికారి లక్ష్మణ్, అధికారులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ ఎంపీడీవోగా శివకృష్ణ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన శివకృష్ణ

నిజాంసాగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండ ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా శివకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్-1 ద్వారా ఎంపీడీవోగా ఎంపికైనా ఆయన కార్యాలయానికి ఉదయమే చేరుకోగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కార్యాలయ సిబ్బందిని, కార్యదర్శులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని, అందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అనిత, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఆయాగ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు తరలిన మెంగారం గ్రామస్తులు



లింగంపేట సబ్‌స్టేషన్‌కు తరలివచ్చిన మెంగారం గ్రామస్తులు

లింగంపేట, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెంగారం గ్రామస్తులు మంగళవారం రాత్రి సబ్‌స్టేషన్‌కు తరలివచ్చారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి గ్రామంలో విద్యుత్ లేకపోవడంతో రాత్రి వరకు చూసిన గ్రామస్తులు జేఎల్ఎమ్ నరేష్‌కు, లైన్‌మెన్ అంబ్యానాయక్‌కు ఫోన్ చేయగా వారు సరిగా స్పందించలేదని ఆరోపించారు. దీంతో లింగంపేటలోని సబ్‌స్టేషన్‌కు తరలివచ్చారు. సిబ్బంది నిర్లక్ష్యంపై ఏడీఈ మల్లేషంకు పిర్యాదు చేశారు. స్పందించిన ఏడీఈ వెంటనే కరెంట్ పునరుద్దరిస్తామని హామీ ఇవ్వడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందికి మెమోలు జారీ చేస్తామని తెలిపారు.

ఇస్రో సందర్శనకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

బాన్సువాడ రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని కొత్తబాద్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని నిదామహీన్ ఇటీవల కామారెడ్డి జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఇస్రో క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇస్రో సందర్శనకు ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ కమల్‌కిషోర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన అంశంపై జరిగిన జిల్లాస్థాయి పోటీపరీక్షల్లో 245మంది విద్యార్థులలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని నిదామహీన్ 3వ స్థానంలో నిలిచి బెంగుళూరు అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించడానికి వెళ్లనున్నట్లు తెలిపారు. విద్యార్థి భవిషత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు